

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 26.0
కనిష్ఠం : 22.0



జై హనుమాన్..
వీరవాసరం మండలం నందమూరుగరువు ఆంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించారు. 6లో..



వాటర్ గ్రిడ్‌కు శ్రీకారం

ఆచంట, పెనుగొండల్లో పైప్‌లైన్ పనులు

భీమవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):జిల్లాలో వాటర్ గ్రిడ్ పనులకు శ్రీకారం చుట్టారు. గోదావరి జలాలను విజ్జేశ్వరం వద్ద శుద్ధి చేసి పల్లెల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులు, షంపులకు పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసే ఈ ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 1,400 కోట్లు కేటాయించాయి. విజ్జేశ్వరం వద్ద నీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి 15 ఎకరాల భూమి కోసం అన్వేషిస్తున్నారు. మరోవైపు జిల్లాలోని ఆచంట, పెనుగొండ మండలాల్లో పైప్‌లైన్ వేసే పని చేపట్టారు. ప్రాజెక్ట్‌పై చర్చించేందుకు కలెక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో గురువారం సమన్వయ కమిటీ సమావేశం జరగనుంది. జిల్లా గ్రామీణ నీటిపారుదల శాఖ దీనికోసం నివేదిక సిద్ధం చేసింది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్‌లో ఆకివీడు, గణపవరం, తాడేపల్లిగూడెం, పెంటపాడు మినహా మిగిలిన 16 మండలాల్లోని 832 ఆవాస ప్రాంతాల్లోని 10.53 లక్షల మందికి తొలి విడత పైపులైన్‌ల ద్వారా శుద్ధి చేసిన మంచినీటిని సరఫరా చేస్తారు. ఆ నాలుగు మండలాలకు రెండో ఫేజ్‌లో నీటిని అందజేస్తారు.

నేడు డీఎల్‌డీవో కార్యాలయాలు ప్రారంభం 7



రైతన్న కోసం.. చంద్రన్న

'రైతన్నా.. మీ కోసం'లో భాగంగా సీఎం చంద్రబాబు బుధవారం తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల వచ్చారు. ఆయనను మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేశ్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జడ్పీ మాజీ చైర్మన్ బాపిరాజు సభా వేదిక వద్దకు తీసుకుని వెళ్లారు.

ప్రధాన వార్త మెయిన్‌లో

సచివాలయాల పర్యవేక్షణకు అధికారుల నియామకం

తాడేపల్లిగూడెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయాలకు మండలాలు, మునిసిపాలిటీల వారీగా అధికారులను నియమించారు. వీరంతా నిత్యం గ్రామ, వార్డు సచివాలయాలను పర్యవేక్షిస్తుంటారు. అక్కడ సిబ్బంది పనితీరుతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరును వీరు పరిశీలిస్తారు. తల్లికి వందనం, రైతు నేస్తం, సర్వేలు, రిజిస్ట్రేషన్లు, అన్నదాత సుఖీభవ, ఆధార్ సేవల పనితీరును తెలుసుకుంటారు. ఇప్పటి వరకు వార్డు సచివాలయాలను మునిసిపల్ కమిషనర్, గ్రామ సచివాలయాలను ఎంపీడీవో పర్యవేక్షిస్తూ ఉండేవారు. ఇప్పుడు తాజాగా నియమితులైన అధికారులు మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోల పర్యవేక్షణలో పనిచేస్తారు. వీరి నియామకంతో కమిషనర్లకు, ఎంపీడీవోలపై కొంత పనిభారం తగ్గింది. మండలాల వారీగా.. కేఆర్ కృష్ణవేణి(ఆచంట), కె.సుజాత(ఆకివీడు), కె.సీతా రామరాజు(అత్తిలి), టి.మోహన్‌బాలకృష్ణ(కాళ్ల), ఎ.కొండాడరామయ్య(పాలకోడేరు), కె.శివాజీ (గణపవరం) వి.వెంకటనారాయణ(ఇరగవరం), భూసారపు శ్రీనివాస్ (యలమంచిలి), ఎం.నాగేశ్వరరావు(మొగల్తూరు), బుర్రా ఆనందబాబు (నర్సాపురం), కేవీఎస్ ఎస్ఎన్ త్రినాథ్(భీమవరం), డి.పద్మాజీ రావు(పాలకొల్లు), ఆర్‌వీ రామకృష్ణ(పెంటపాడు), వి.మల్లే శ్వరరావు (పెనుగొండ), సీహెచ్‌కే వెంకటరెడ్డి (పెను మంట్ర), డి.శ్రీనివాస్ (పోడూరు), వి.వాణి (తాడేపల్లిగూడెం), యు.శ్రీనివాస మోనవర్తి(తణుకు), కె.గోపాలకృష్ణ (ఉండి), పి.దుర్గాప్రసాద్ (వీరవాసరం)లను నియమించారు.

వైసీపీ త్రిసభ్య కమిటీల ధన దాహానికి..

సొసైటీలు స్వాహా

వైసీపీ హయాంలో సహకార సంఘాల్లో ఏర్పాటుచేసిన త్రిసభ్య కమిటీల్లోని కొందరు లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు స్వాహా చేశారు. అధికారుల తాజా విచారణల్లో ఒక్కో సొసైటీల్లో జరిగిన అవినీతి బట్టబయలు అవు తోంది. బినామీ పేర్లతో రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం చెల్లించే ధాన్యం కమీషన్‌లు మింగేశారు. ఫోర్జరీ సంతకాలతో సొసైటీ నిధులు పక్కదారి పట్టించారు. ఇలా సొసైటీలను స్వాహా చేసి.. వాటి మనుగడను బలి తీసుకున్నారు.



- బినామీల పేరిట రుణాలు
- ఫోర్జరీ సంతకాలతో ధాన్యం కమీషన్ సొమ్ములు, నిధులు మింగేశారు
- పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు..
- అధికారుల విచారణలతో అవినీతి బట్టబయలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పెంటపాడు మండలం కోరుమిల్లి సొసైటీలో వైసీపీ హయాంలో ఏర్పాటైన త్రిసభ్య కమిటీ రూ.1.70 కోట్లు పక్కదారి పట్టించింది. జిల్లా సహకార బ్యాంకు నుంచి నిధులు తెచ్చి బినామీ పేర్లతో రుణాలు ఇచ్చినా వాటిని రికవరీ చేయలేదు. కమిటీ సభ్యులు, అప్పటి సిబ్బంది కుమ్మక్కై నిధులు మింగేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశించడంతో అవినీతి జరిగినట్టు అధికారులు నిగ్గు తేల్చారు. వడ్డీతో సహా స్వాహా అయిన నిధులు రూ.2.23 కోట్లకు చేరినట్టు లెక్కలు కట్టారు. వైసీపీ హయాంలో అవినీతి దందాకు కోరుమిల్లి సొసైటీ బలైంది. జిల్లా సహకార బ్యాంకు నుంచి తెచ్చిన సొమ్ములకు వడ్డీలు చెల్లిస్తూ వస్తోంది. మరోవైపు అప్పట్లో ప్రభుత్వం సొసైటీకి విడుదల చేసిన ధాన్యం కమీషన్ సొమ్మును ఖర్చులు చూపించి బొక్కేశారు. వాస్తవానికి రైతులకు రవాణా, తూకం ఛార్జీల రూపంలో చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. రైతులకు ఇవ్వకుండా, సొసైటీకి వినియోగించకుండా వైసీపీ నేత ధాన్యం కమీషన్ సొమ్మును మింగేశారు. లెక్క తేలిన దందాపై రికవరీ చేస్తామంటూ అధికారులు చెబుతున్నారు.

ఒక్కో సొసైటీది ఒక్కో కథ

దర్శిపర్రు సొసైటీలో రూ.22 లక్షలు అవినీతి జరిగినట్టు ప్రాథమికంగా గుర్తించారు. అక్కడ 51 విచారణ కొనసాగుతోంది. రుణాల గల్లంతు, కమీషన్ల స్వాహా ఆరోపణలు వెలుగుచూశాయి. సిద్ధాంతం సొసైటీలో రూ.1.50 కోట్లు గల్లంతైంది. దీనిపై విచారణ చేపట్టి అవినీతి జరిగినట్టు నిర్ధారించారు. ఇరగవరం మండలం కొత్తపాడు సొసైటీలో రూ.51 లక్షలు తేడా కనిపిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సొసైటీ ఖాతాలపై ఆరా తీశారు. దీంతో అక్కడ ఒక సిబ్బంది ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. ఇప్పటికీ అక్కడ విచారణ కొనసాగుతోంది.నార్నిమెరక సహకార సంఘంలో రూ. 11 లక్షలు, మేడపాడు సహకార సంఘంలో రూ.7 లక్షలు దుర్వినియోగం అయినట్టు గుర్తించారు. దీనిపై జిల్లా సహకార అధికారి విచారణకు ఆదేశించడంతో దర్యాప్తు చేపడుతున్నారు.

నష్టాల్లో సహకార సంఘాలు

వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు త్రిసభ్య కమిటీలే రాజ్యమేలాయి. వారి హయాంలో నిధులు దుర్వినియోగానికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. జిల్లాలోని అత్యధిక సొసైటీలు పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయాయి. కూటమి ప్రభుత్వంలో ఏర్పాటైన త్రిసభ్య కమిటీలు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నాయి. సొసైటీలు ఎంత మేర నష్టాల్లో ఉన్నాయనే దానిపై ప్రస్తుత కమిటీలు లెక్కలు కట్టే పనిలో నిమగ్నమయ్యాయి. అవినీతి దందాలపై వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా అధికారులు విచారణకు ఆదేశిస్తున్నారు.

రికవరీలు కష్టమే..!

సొసైటీల్లో పక్కదారిపట్టిన సొమ్ములను రికవరీ చేసిన సందర్భాలు తక్కువే. రికవరీ చేస్తామంటూ అధికారులు చెబుతున్నా.. ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. నిధుల దుర్వినియోగం సమయంలో పనిచేసిన సిబ్బందికి నోటీసులు జారీ చేయలేదు. దీంతో ఎంత మేర రికవరీ అవుతుందోనన్నది సందేహమే..!

కూటమి పార్టీల్లోకి వెళ్లేందుకు..

తాడేపల్లిగూడెం రూరల్ మండలం అరుగొలనులో రూ.10.50 లక్షలు గోల్‌మాల్ జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో 52 విచారణకు ఆదేశించారు. అధికారులు రికార్డులు పరిశీలించారు. వైసీపీ హయాంలో ధాన్యం కమీషన్ సొమ్ములు సొసైటీల్లో దుర్వినియోగమయ్యాయి. అప్పటి నేతలు జేబుల్లోకి నిధులు మళ్లాయి. ఆ దందాలు వెలుగులోకి వస్తాయన్న ఉద్దేశంతో కొందరు వైసీపీ నాయకులు కూటమిలో పార్టీల్లోకి చేరేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ఈ నెల 6 నుంచి జనవరి 5 వరకు కార్యాచరణ

సహకారం సమరం

డిమాండ్ల పరిష్కారానికి ఉద్యోగుల పోరాటం

ముదినేపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):తమ దీర్ఘకాలిక డిమాండ్ల పరిష్కారానికి సహకార సంఘాల ఉద్యోగులు పోరుబాట పట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ జేఏసీ ఈ నెల 6 నుంచి జనవరి ఐదో తేదీ వరకు చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలను నాయకులు ప్రకటించారు. డీసీసీబీ పరిధిలోని ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 260 పీఏసీఎస్‌ల్లో 1,100 మంది ఉద్యోగులున్నారు. వీరిలో 260 మంది సంఘాల సీఈవోలు, 840 మంది ఇతర ఉద్యోగులు. ఆందోళనల్లో భాగంగా 6న నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు. 8న డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయాల వద్ద, 16న జిల్లా సహకార శాఖాధికారి కార్యాలయాల వద్ద, 22న డీసీసీబీ ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తారు. 29న విజయవాడలో మహాధర్నా, జనవరి 5 నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. ఉద్యోగుల డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఆందోళన చేస్తామని జేఏసీ నేత బి.రఘురామ్ అన్నారు.

ఇవీ డిమాండ్లు

- జీవో 36 అమలు చేయాలి.
- ప్రతి ఐదేళ్లకు వేతన సవరణ జరగాలి.
- పెండింగ్ వేతన సవరణలపై చర్యలు తీసుకోవాలి.
- ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి.
- రూ.5 లక్షలకు తగ్గకుండా ఆరోగ్య బీమా కల్పించాలి.
- ఉద్యోగుల డ్యూటీ పద్దులను రద్దు చేయాలి.
- 2019 తర్వాత చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి.
- 2011 నుంచి రైతులకు డివిడెండ్ చెల్లించాలి.
- నిబంధనల ప్రకారం ఉద్యోగులను బదిలీ చేయాలి.
- జీతాలను డీఎల్ఎస్ఎఫ్ ద్వారా చెల్లించాలి.
- సీనియార్టీ ప్రకారం ఉద్యోగులను సంఘాల సీఈవోలుగా నియమించాలి.

14 వరకు పీఎంఏవైజీ దరఖాస్తుల గడువు పెంపు

- ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు 14,296

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ(పీఎంఏవైజీ) కింద దరఖాస్తుల స్వీకరణ, సర్వేను ఈ నెల 14 వరకు పొడిగించారు. జిల్లావ్యాప్తంగా 14,296 దరఖాస్తులు అందాయి. అందులో 7,313 మంది లబ్ధిదారుల సర్వే పూర్తి చేశారు. అర్హులుగా గుర్తించారు. పట్టణాల్లో లబ్ధిదారులకు రూ.2.50 లక్షల రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇవ్వడానికి ముందుకొచ్చింది. గత ప్రభుత్వంలో ఒక్కో ఇంటికి కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే రాయితీ ఇచ్చేది. అది ఊరికి దూరంగా స్థలాలు కేటాయించారు. సొంత స్థలం ఉన్నా సరే రాయితీ తక్కువగా ఉండడంతో ఇళ్ల నిర్మాణానికి అప్పట్లో లబ్ధిదారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. నిర్మాణం చేపట్టని లబ్ధిదారుల జాబితాను ఆన్‌లైన్ నుంచి ప్రభుత్వం తొలగించింది. పెండింగ్‌లో ఉంటే కేంద్ర ప్రభుత్వం కొత్త ఇళ్ల మంజూరు చేయడానికి ససేమిరా అంటోంది, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 1.0లో ఇళ్ల పూర్తిచేసిన తర్వాత తదుపరి కేటాయిస్తామని స్పష్టం చేసింది. దీంతో గత ప్రభుత్వంలో ఇళ్ల మంజూరై నిర్మాణం చేపట్టని లబ్ధిదారుల జాబితాను తొలగించారు. దీంతో కొత్తగా 2.0లో ఇళ్ల మంజూరుకు మార్గం సుగమమైంది. గ్రామాల్లో ఇంటి నిర్మాణానికి ఎంత మేర రాయితీ ఇస్తున్నారనే విషయం ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఇళ్ల మంజూరు సమయంలో ప్రభుత్వం దీనిపై ప్రకటన చేయనుంది.

నియోజకవర్గం	గుర్తించిన ఇళ్లు	దరఖాస్తులు
నర్సాపురం	258	1254
మొగల్తూరు	305	1213
తాడేపల్లిగూడెం	974	1208
యలమంచిలి	439	1045
భీమవరం	501	971
పోడూరు	264	934
పెంటపాడు	802	926
కాళ్ల	403	867
గణపవరం	665	739
వీరవాసరం	394	668
పాలకొల్లు	330	652
ఉండి	175	572
పెనుగొండ	246	567
ఆచంట	226	541
ఆకివీడు	296	484
ఇరగవరం	235	371
పాలకోడేరు	167	357
పెనుమంట్ర	162	356
అత్తిలి	264	306
తణుకు	207	265



ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం సానుకూలం
ఎన్‌జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ 7

ఫలించిన పరిశ్రమ

- ఏలూరు జిల్లాలో రూ.371 కోట్లతో ఐదు పరిశ్రమలు.. 811 మందికి ఉద్యోగాలు
- విశాఖ పెట్టుబడుల సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ఘనత

(ఏలూరు-ఆంధ్రజ్యోతి):

ఏలూరు జిల్లాలో రూ.371 కోట్లతో ఐదుచోట్ల పరిశ్రమలను స్థాపించనున్నారు. విశాఖలో గత నెలలో 13, 14 తేదీల్లో జరిగిన పెట్టుబడుల సదస్సులో ఈ మేరకు ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా 811 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఏడాదిలోపే ఈ పరిశ్రమలు నెలకొల్పేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దెందులూరు మండలం సత్యనారాయణపురం వద్ద ఇయాన్ సంస్థ తన ఎకరన్నర స్థలంలో టూరిజం కు అనుసంధానంగా ఏడు కోట్లతో ఇంటిగ్రేటెడ్ ట్రావెల్ హబ్(కార్వాన్ పార్కు)ను ఏర్పాటు చేయనుంది. తద్వారా 35 మందికి ఉపాధి కలగనుంది. కేరళ తరహా ఈ కార్వాన్ పార్కులో ట్రావెలర్స్‌కు అత్యాధునిక వసతులు కల్పిస్తారు. కాటేజీలు, వివిధ ఫ్యూయల్స్ నింపుకోవడంతోపాటు, బస్సుల్లోనే విడిది చేయవచ్చు. గత నెలలోనే ద్వారకా తిరుమల మండలం సీహెచ్ పోతేపల్లిలో గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ రూ.209 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ విస్తరణకు శ్రీకారం చుట్టింది. 66 మందికి ఉపాధి లభించనుంది. పామాయిల్ రిఫైనరీ, నాన్ డెయిరీ క్రీమర్ ప్యాట్స్ ఇతర ఉత్పత్తులను తయారు చేస్తుంది. అక్షోభ్య సంస్థ రూ.30 కోట్లతో రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌ను స్థాపించి 450 మందికి ఉపాధి కల్పిస్తామని ముందు కొచ్చింది. సుధీష్‌రామ్ రెన్యువల్ ఎనర్జీ సంస్థ రెన్యువల్ ఎనర్జీ ఎక్విప్‌మెంట్ అసెంబుల్డ్ తయారీ పరిశ్రమకు సిద్ధమైంది.



రూ.50 కోట్లతో 60 మంది ఉద్యోగాలను కల్పించనుంది. వీరు స్థల పరిశీలనలో ఉన్నారు. సాన్వో ఫార్మా రూ.75 కోట్లతో 200 మందికి ఉపాధి కల్పించేందుకు ఫార్మాస్యూటికల్ డ్రగ్స్ కంపెనీని నెలకొల్పనుంది. దీనికి మూడెకరాలు ఉన్నట్టు తెలిపింది. ఈ మూడు పరిశ్రమల స్థలాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇతర అనుమతులను జిల్లా యంత్రాంగం ఇవ్వాల్సి ఉంది. ఆయా సంస్థలు ఎక్కడ నెలకొల్పుతాయో ప్రకటించాల్సి వుంది.



పెనుగొండ సీహెచ్‌సీ వైద్య సేవలపై కలెక్టర్ సంతృప్తి

పెనుగొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెనుగొండ సామాజిక ఆరోగ్య కేంద్రం సేవలపై జిల్లా కలెక్టర్ నాగరాణి సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆసుపత్రిని తనిఖీ చేసి ఇక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. డెలివరీలు, పరీక్షలు, సర్జరీలు ఎలా జరుగుతున్నాయో తెలుసుకున్నారు. వైద్య సేవలు, వైద్యుల సమయపాలనపై రోగులతో మాట్లాడారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీని నియమించాలని ఆదేశించారు. హెచ్‌డీఎస్ ఫండ్స్‌ను హాస్పిటల్ అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. ఆసుపత్రిలలో అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఆర్డీవో దాసిరాజు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పి. సూర్యనారాయణ, సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.రాంబాబు, తహసీల్దార్ జి. అనితకుమారి, వైద్యులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన

పెనుగొండలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను కలెక్టర్ నాగరాణి బుధవారం సందర్శించారు. పిల్లల చదువు, ఆరోగ్యంపై ఆరా తీశారు. పాఠశాల నిర్వహణ ఎలా జరుగుతుందో తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించారు. బాగా చదువుకోవాలని హితబోధ చేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

చిన్నారులతో కలెక్టర్ విజయకేతనం

కష్టపడి పనిచేస్తే పదవులు అవే వస్తాయి

గోపాలపురం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు



సీఎం సభలో మాట్లాడుతున్న మద్దిపాటి

గోపాలపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పార్టీకి కార్యకర్తలే బలం. అలాంటి కార్యకర్తలను నాయకుడే కాపాడుకోవాలి. ప్రతి కార్యకర్త బాగోగులు చూసుకునే బాధ్యత నాదే. కష్టపడి పనిచేస్తే పదవులు వాటంతట అవే వస్తాయని సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో బుధవారం జరిగిన టీడీపీ గోపాలపురం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. నిస్వార్థంగా శ్రమించే కార్యకర్త ఉన్నంతకాలం తెలుగుదేశం పార్టీకి తిరుగులేదన్నారు. నియోజకవర్గంలో కష్టపడి పనిచేసే నాయకుడు ఉన్నప్పుడే ఆ నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, గోపాలపురం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి ప్రస్తుతం బేషుగ్గా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పార్టీ పట్ల విధేయత, గౌరవం ఉన్న వ్యక్తి అని, ఆయన నాయకత్వంలో గడిచిన రెండేళ్లలో పార్టీ ఏకతాటిపై నడుస్తోందన్నారు. నియోజకవర్గానికి సమర్థుడైన అభ్యర్థినే ఎంపికచేసి పంపించానని, మీ ఆశీస్సులతో గెలిపించి అసెంబ్లీకి పంపించారని, ఇది కార్యకర్తల విజయమేనన్నారు. పేదరికాన్ని నిర్మూలించడానికి పీ4 విధానం ప్రవేశపెట్టామన్నారు. కార్యకర్తలకు రక్షణగా ఉండడానికి పార్టీ సభ్యత్వం ఉన్న ప్రతీ ఒక్కరికి ప్రమాద బీమా కల్పిస్తున్నామన్నారు. గతంలోనూ పెద్దదిక్కు కోల్పోయిన కుటుంబాలకు టీడీపీ అండగా ఉందన్నారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా పార్టీ ఆదుకుంటుందన్నారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడారు. అనంతరం కార్యకర్తలతో చంద్రబాబు సెల్ఫీ ఫొటోలు దిగారు.

ఘనంగా భక్తాంజనేయ ఉత్సవాలు

నందమూరు గరువులో భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద 60వ వార్షికోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం కొప్పనీడి శ్రీనివాసరావు లక్ష్మికృష్ణకుమారి దంపతులచే కలశ స్థాపన చేసి పూజలు చేశారు. ఏపీ శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు పాల్గొని పూజలు చేసి స్వామివారి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంలో సీతారామచంద్ర స్వామి వారితో కలిసి గ్రామోత్సవం ముందుకు సాగింది. బాణ సంచాకాల్పులతోపాటు, రామందండు, మహిళల నృత్యాలు అఘోరాతో పరమేశ్వరుడు, శక్తి వేషాలతో పాటు గుర్రాల నృత్యాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయం నుంచి బయల్దేరిన ఉత్సవం వీరవాసరం వరకు సాగింది. అక్కడి నుంచి శృంగవృక్షం వరకు సాగి తిరిగి ఆలయానికి చేరింది. సాయంత్రం వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- వీరవాసరం,(భీమవరం టౌన్), ఆంధ్రజ్యోతి



ప్రత్యేక అలంకరణలో స్వామి వార్లు



ఆకట్టుకున్న వేషధారణలు





రైతు చేతిలో వ్యవసాయ ప్రపంచం

రాష్ట్రంలో వ్యవసాయం లాభసాటిగా మార్చి రైతన్నల ఆదాయం పెరిగి జీవన ప్రమాణాలు పెంచేలా ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన పంచ సూత్రాలను రైతులకు వివరించేందుకు ఉద్దేశించిన రైతన్న మీకోసం కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నది. దీని కోసం రూపొందించిన ప్రత్యేక మొబైల్ యాప్ ఏపీఏఐఎం 2.0 (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం) ద్వారా వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల సేవలు, పంటల వివరాలు, తెగుళ్ల నివారణ, వాటికి అవసరమైన పురుగు మందుల వివరాలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో పాటు పంటల మార్కెటింగ్ వివరాలు రూపొందించారు. వాటి ద్వారా పంటలకు సాంకేతికతను జోడించి సాగు ఖర్చులను తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమం గ్రామాల్లో ఉత్సాహంగా సాగుతున్నది.

ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మొబైల్ యాప్‌తో రైతుకు మేలు



అత్తిలిలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి (ఫైల్ ఫొటో)

తణుకు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ, దాని అనుబంధ శాఖల ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు, సిబ్బందితో పాటు గ్రామాల్లోని ప్రజా ప్రతినిధుల రైతుల ఇంటి వద్దకే వెళ్లి ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ సంస్కరణలు వివరించి, ప్రభుత్వం రూపొందించిన నూతన యాప్‌ను రైతుల మొబైల్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వ్యవసాయంలో సాంకేతికత ఆధారంగా సాగు ఖర్చును తగ్గించాలని, దీనితో పాటు ప్రకృతి సేద్యాన్ని రైతులలో ప్రోత్సాహించాలని, రైతులు పండించిన పంటలకు మరింత విలువలు పెంచి అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌లో మన వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధర పలకాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈకార్యక్రమం చేపట్టింది. రైతుల వ్యక్తిగత తాలూకా సాగు సమస్యలు, యంత్ర పరికరాల లభ్యత వివరాలు, రైతులకు కావలసిన పరికరాల వివరాలను తెలుసుకోవడంతో పాటు రాబోయే కాలంలో లాభసాటి వ్యవసాయానికి కావలసిన అవసరాలను తెలుసుకోవడం, రాబోయే మూడు సీజన్‌లకు ముందస్తు ప్రణాళికలను తయారు చేసుకోవడం కోసం రైతులకు ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని వివరించడం కోసం రైతన్న మీకోసం కార్యక్రమం చేపట్టింది. సర్వేతో కూడిన ఈకార్యక్రమంలో సేకరించిన డేటాను కన్సాలిడేట్ చేసి గ్రామాల్లోని ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో గ్రామ సభను ఏర్పాటు చేస్తారు. దీని ప్రకారం రాబోయే మూడు సీజన్లు అంటే రబీ, ఖరీఫ్, రబీలలో రైతులు అను సరించవలసిన ముందస్తు పంటల ప్రణాళికను రైతుల సమక్షంలోనే తయారు చేస్తారు.

భాగస్వాములయ్యేది వీరే...

రైతన్న మీకోసం కార్యక్రమంలో వ్యవసాయ శాఖలోని విలేజ్ వ్యవ సాయ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్, విలేజ్ రెవిన్యూ ఆఫీసర్, విలేజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్, విలేజ్ ఎనర్జీ అసిస్టెంట్, ఏపీ సీఎస్ఎఫ్ సిబ్బంది, పీఏసీఎస్ మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొంటారు. ఈ యాప్‌లో రైతుల వివరాలు నమోదు చేయడం ద్వారా రాబోయే రోజుల్లో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల పూర్తి సమాచా రం ఈ యాప్‌లో వుంటుంది. ఎప్పటికప్పుడు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన, ఈ క్రాప్, వ్యవసాయ యాంత్రీకరణ, ఇతర పథకాలకు అవసరమైన సమాచారం ఇందిలో వుంటుంది.

కార్యాలయాలు చుట్టూ తిరిగే పనిలేదు



ఈ యాప్‌తో అన్ని సేవలు రైతుల చేతుల్లోని మొబైల్‌లో అందుబాటులోకి వచ్చాయి. దీనితో రైతుకు సంబంధించిన పంట ఈకేవైసీ చేసిందీ, లేనిదీ రైతు ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు రైతే స్వయంగా నమోదు చేసుకోవచ్చు. దీని వలన రైతు తమ పంటలకు సంబంధించిన వివరాల నమోదు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని తగ్గింది.

-వైవీవీ సత్యనారాయణ, రైతు మండపాక

4748 మంది రైతుల మొబైల్‌లలో యాప్



మండలంలోని రైతు సేవా కేంద్రాల పరిధిలోని 4748 మంది రైతులను వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది కలసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపొందించిన పంచ సూత్రాలను వివరించారు. ఈకార్యక్రమంలో ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న ప్రతి రైతుకు ఏపీఏఐఎం 2.0 (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం) యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు.

- కె.రాజేంద్ర ప్రసాద్, వ్యవసాయాధికారి, తణుకు


కొత్త రేషన్ కార్డులిక సులువు



- దరఖాస్తులకు మార్గం సులభతరం చేసిన ప్రభుత్వం
- సచివాలయాల్లో మరిన్ని రేషన్ కార్డు సంబంధిత సేవలు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం మార్గం సులభతరం చేసింది. గతంలో కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే సంవత్సరంలో ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే గ్రామ, వార్డు సచివాలయాలకు అవకాశం ఇచ్చేది. దీంతో ప్రజలు ఎదురు చూడాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ కార్డుకు సంబంధించి కొత్తగా మరిన్ని సేవలను అందుబాటులోకి తెచ్చింది. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు, కార్డు విభజన, అడ్రస్ మార్పులు, రేషన్‌కార్డు సరెండర్, పిల్లలు, భార్య ను కార్డులో చేర్చడం, మృతి చెందిన, ఇతరుల పేర్లు తొలగింపు ప్రక్రియ ఆరు నెలలుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో జరుగుతూనే ఉంది. రేషన్ కార్డులకు సంబంధించి ప్రజలకు అవస రమైన సేవలను పొందడానికి అవసరమైన పత్రాలతో పాటు ఆయా సచివాలయాల్లో సేవలందించినందుకు స్వల్ప రుసుం చెల్లింపు తప్పనిసరి. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత వీఆర్వోలు ఆ దరఖాస్తును పరిశీలించి కావలసిన పత్రాలను దరఖాస్తుదారుల నుంచి సేకరించి పరిశీలన నిమిత్తం తహసీల్దారు కార్యాలయానికి పంపుతారు. తహసీల్దార్ ధ్రువపత్రాలను పరిశీలించి అన్నీ సరిగా ఉంటే మంజూరు చేస్తారు లేదంటే తిరస్కరిస్తారు.

- **కొత్త రేషన్ కార్డుకు అవసరమైన పత్రాలు**
  1. దరఖాస్తు ఫారం
  2. కుటుంబ సభ్యులందరి ఆధార్
  3. దరఖాస్తు రుసుము రూ.24
- **కార్డులో పిల్లల్ని చేర్చడానికి..**
  1. దరఖాస్తు ఫారం
  2. పుట్టిన తేదీ సర్టిఫికెట్
  3. చైల్డ్ ఆధార్ జిరాక్స్ (కార్డులో చేర్చే వారిది మాత్రమే)
  4. తల్లి, తండ్రి ఆధార్ జిరాక్సులు
  5. రేషన్‌కార్డు జిరాక్స్
  6. దరఖాస్తు రుసుము రూ.24
- **భార్య పేరు చేర్చేందుకు..**
  1. దరఖాస్తు ఫారం
  2. భార్యాభర్తల ఆధార్ జిరాక్స్‌లు
  3. రేషన్‌కార్డు జిరాక్స్
  4. దరఖాస్తు రుసుము రూ.24
- **అడ్రస్, రేషన్ షాపు మార్పునకు..**
  1. దరఖాస్తు ఫారం
  2. యజమాని ఆధార్‌కార్డు జిరాక్స్
  3. యజమాని ఈకేవైసీ
  4. దరఖాస్తు రుసుము రూ.24
- **రేషన్ కార్డు విభజన కోసం**
  1. దరఖాస్తు ఫారం
  2. ఆధార్ జిరాక్స్ కాపీలు కుటుంబ సభ్యులందరివి
  3. దరఖాస్తు రుసుము రూ.48
- **కార్డు సరెండర్ కోసం..**
  1. దరఖాస్తు ఫారం
  2. యజమాని ఆధార్‌కార్డు జిరాక్స్
  3. రేషన్‌కార్డు జిరాక్స్
  4. దరఖాస్తు రుసుము రూ.24
- **సభ్యుల తొలగింపు కోసం..**
  1. దరఖాస్తు ఫారం
  2. మృతుడి ఆధార్
  3. మృతుడి మరణ ధ్రువీకరణ పత్రం
  4. దరఖాస్తు రుసుం రూ.24
- **పేరు, తప్పులు సరిచేసేందుకు..**
  1. దరఖాస్తు ఫారం
  2. పేరు తప్పు పడిన వారి ఆధార్ జిరాక్స్
  3. రేషన్‌కార్డు జిరాక్స్
  4. దరఖాస్తు రుసుము రూ.24



రేషన్‌కార్డు దరఖాస్తు

యాంత్రీకరణతో లాభసాటి వ్యవసాయం

మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణతో వ్యవసాయం లాభదాయకమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నెక్కలం గొల్లగూడెంలో బుధవారం రైతన్నా.. మీ కోసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కూలీల కొరత ఎక్కువగా ఉన్నందున యాంత్రిక శక్తి ఉపయోగించుకోవాలని కోరారు. రైతులకు రోటావేటర్, డ్రోన్, ట్రాక్టర్లు, వ్యవసాయ పని ముట్లు ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందిస్తోందన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు చేస్తే నీటి వినియోగం తగ్గి లాభసాటిగా ఉంటుందన్నారు. వరిపంటను తగ్గించి పామాయిల్, కోకో, మొక్కజొన్న లాంటి వాణిజ్య పంటలు సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందన్నారు. అంతర్ పంట కూడా వేసి రైతులు లాభాలు గడించవచ్చన్నారు.

పరిమెళ్ళలో తాగునీరు వృథా



పరిమెళ్ళ గ్రామంలో వాటర్ ట్యాంకుల్లోకి తాగునీరు ఎక్కించే క్రమంలో అది నిండిపోయి కిందకు వృథాగా నీరు పోతున్నా కనీసం ఆపుచేయడం లేదు. దీనిపై స్థానికులను ఆరా తీయగా చాలా సార్లు ఇదే విధంగా నీరు వృథాగా పోతుందని చెబుతున్నారు.

- పెంటపాడు (ఆంధ్రజ్యోతి)

మురుగునీరు వస్తున్న కుళాయికి మరమ్మతులు

పాలకోడేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కుళాయిల ద్వారా మురుగునీరు- లబోదిబోమంటున్న శృంగవృక్షం వడ్డీలవారి వీధి వాసులు అంటూ ఆంధ్రజ్యోతిలో ఈ నెల 1న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆంధ్రజ్యోతి కథనాన్ని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు సైతం చూసి పంచాయతీ అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో ఒక చోట పంచాయతీ సరఫరా చేస్తున్న కుళాయిలో మురుగునీరు కలుస్తుందని గమనించి ఆ ప్రదేశాన్ని తవ్వి మరమ్మతులు చేపట్టారు. పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి కనుమూరి వెంకట్రాజు పర్యవేక్షించారు. కాలనీ వాసులు సైతం ఆంధ్రజ్యోతిలో కథనంతోటే అధికారులు స్పందించారంటూ హర్షం వ్యక్తం చేశారు.

వర్షంతో ధాన్యానికి దెబ్బ

నెమ్ము ధాన్యంగా విక్రయాలు.. అక్కడక్కడా ధాన్యం మొలకలు





భీమవరం మండలంలో మొలకెత్తిన ధాన్యం.. పెనుమంట్ర మండలం వెలగలేరులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుపాన్ రైతులకు నష్టాలు, కష్టాలు చూపించింది. చక్కగా సాగుతున్న పంట మాసూళ్లకు అడ్డుకట్ట వేసింది. గట్లకు చేరిన ధాన్యం మొలకలు ధాన్యం నెమ్ముతో పొడి రావడం జరుగుతుంది. దీంతో రైతులలో అలజడి మొదలైంది. జిల్లాలో ధాన్యంగా ఉన్న 30 వేల టన్నులలో ఎక్కువగా ధాన్యం రాశులుగా ఉన్నాయి. వాటిని భద్రపరిచేందుకు ఎండుగడ్డి లేనందున బరకాలు మాత్రమే వాడుతున్నారు. అధిక వర్షాలు పడినచోట పైనుంచి రాశి కింద నుంచి వర్షపు నీరు చేరింది. ఆ రాశుల్లో ధాన్యం మొలకలు వచ్చాయి. మబ్బుల వాతావరణంలో మాసూళ్ళయి ఎండబెట్టడానికి వీలులేని ధాన్యంలో తేమ ఉండిపోయింది. అదివేడిగా మారడంతో ధాన్యం రంగు మారుతుంది. దీంతో రైతులు మేఘాలలో వాటిని ఆరబెట్టారు. మరికొంత మంది రైతులు తేమ శాతం ధరకే అంటే బస్తారూ.200 తక్కువకే విక్రయిస్తున్నారు. మొలకలు వస్తే ధాన్యం కొనుగోలు ఇబ్బందిగా మారుతుంది. వర్షాలు ధాన్యంకే పెద్ద దెబ్బగా మారింది.

మానుగాయితో అంతా నష్టం

సార్వా చేలు ఈనిక దశలో మొంథా తుపాన్ వర్షాలు పడటంతో ధాన్యం గింజకు మానుగాయి ఏర్పడింది. కొన్ని చేలకు ఎండ తెగులు వచ్చింది. వీటి వలన పంట దిగుబడి ఎకరానికి 20 బస్తాలు లోపుగా మారింది. ఎండాకు తెగులు వల్ల గింజ సరిగా పోసుకోలేదు. మానుగాయి వల్ల దిగుబడి తగ్గిపోవడం, కొనుగోలు చేసిన మిల్లర్లకు బియ్యం దిగుబడిరాదు. మానుగాయి వచ్చిన గింజ జల్లెడలో దిగకుండా పొట్టులోకి పోతుంది. రైతు మిల్లర్లకు నష్టంగా మారింది.

ధాన్యం కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు చేశాం

పెనుమంట్ర, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు చేయడం జరిగిందని, రైతులు ఆర్ఎస్కేలను ధాన్యం అమ్మకాలకు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వెలగలేరు గ్రామపంచాయతీ పరిధిలోని మార్టేరు బ్రాహ్మణ చెరువు ప్రధాన రహదారిపై నిల్వ చేసిన ధాన్యం రాశులను కలెక్టర్ బుధవారం పరిశీలించి కొద్ది సమయం రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ గోనెసంచుల నాణ్యత, ధాన్యం రవాణా సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, రైతు సేవా కేంద్రాల పనితీరు, అధికారుల అందుబాటు సేవలు పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లుల వద్ద ఎలాంటి సమస్యలు ఎదురైనా తక్షణమే స్థానిక అధికారులకు తెలియజేయాలని ఆమె సూచించారు. దళారీలను నమ్మి మోసపోవద్దని రైతులను హెచ్చరించారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, నాణ్యమైన సేవలే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందని ఈ సందర్భంగా రైతులకు తెలిపారు.

క్రీడల్లో సీఆర్ఆర్ విద్యార్థుల ప్రతిభ



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైన వారిలో సీఆర్ఆర్ విద్యార్థులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సిద్ధార్థ విద్యా సంస్థల్లో నిర్వహించిన ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ట్రోఫీని గెలుచుకున్నారని స్కూలు కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ప్రిన్సిపాల్ సాయికుమారి తెలిపారు.

● పల్నాడులో ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ సెలక్షన్స్‌లో సీనియర్స్ విభాగంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు ఏలూరు సీఆర్ఆర్ అటానమస్ కళాశాల డిగ్రీ విద్యార్థులు ఎం.ధనగణేష్, జి.జితేంద్ర, జి.ఎనోష్, ఆర్.శ్రీరామ్ ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్ తెలిపారు. అండర్-19 జూనియర్స్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు ప్రథమస్థానం సాధించడంలో కె.హేమంత్ కుమార్ కీలకపాత్ర వహించాడని వివరించారు.

జాతీయ స్థాయి పోటీలకు టి.నరసాపురం విద్యార్థులు



టి.నరసాపురం: జాతీయ స్థాయి క్రికెట్, రగ్బీ పోటీలకు టి.నరసాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ ఎం బీఎల్ స్వామి తెలిపారు. ఇటీవల కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ క్రికెట్ అండర్-14లో ఎంపికైన కాసగాని సాయి దీపక్, బి.పవన్, రగ్బీ అండర్-17 విభాగంలో బి.దయాకర్ త్వరలో జమ్మూ కాశ్మీర్, ఒరిస్సా రాష్ట్రాల్లో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన పీడీ అడపా రామకృష్ణను పలువురు అభినందించారు.



పది పరీక్షలకు పక్కా ప్రణాళిక

భీమవరం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ప్రభుత్వం, అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యా శాఖ అడుగులు వేస్తుంది. కార్యాచరణ రూపొందించి విద్యార్థులకు మెటీరియల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ నెల 6 నుంచి వంద రోజుల ప్రణాళికగా నడపనున్నారు.

వంద రోజుల ప్లాన్‌లో మార్పులు

ఈసారి టెన్త్ విద్యార్థుల ఉత్తీర్ణతపై దృష్టి పెట్టి విద్యాశాఖ వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో కొన్ని మార్పులు తీసుకొచ్చింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే 12,890 విద్యార్థుల ఉత్తీర్ణత లక్ష్యంగా పెట్టుకున్నారు. వెనుకబడిన విద్యార్థులను ఉత్తీర్ణులు చేసే దిశగా బోధన ప్లాన్ రూపుదిద్దారు. ముందుగా ఏ, బీ, సీ, డీ నాలుగు కేటగిరీలుగా విద్యార్థులను విభజిస్తారు. ఏ, బీ లను వంద రోజుల ప్లాన్‌లో నడిపిస్తారు. సీ విద్యార్థులపైన ప్రత్యేక ఫోకస్ పెడతారు. ఇక డీ కేటగిరీ బాగా డల్లర్ విద్యార్థులుగా నిర్ణయించారు. వీరిలో ముగ్గురు విద్యార్థులను ఒక ఉపాధ్యాయునికి అప్పగిస్తారు. ఆ సబ్జెక్టులో వారిని ముందుకు తీసుకువచ్చేలా బాధ్యతలు అప్పగిస్తారు. దీనివల్ల ఫెయిల్ ప్లేస్‌లో ఉన్నా వీరు ఉత్తీర్ణత బాట పడతారు. ఇక నుంచి విద్యార్థులకు ప్రతి రోజు బోధన పూర్తయ్యాక వాటిపై పరీక్ష నిర్వహిస్తారు. గత ఏడాది వారానికి ఒకసారి పరీక్ష పెట్టారు దానిలో మార్పు తెచ్చారు. రోజు పూర్తయిన పరీక్షలో విద్యార్థుల ప్రతిభ వివరాలు ఒక మ్యాప్‌లో పొందుపరచాలి.

రేపు పేరెంట్స్, ఉపాధ్యాయ మీటింగ్‌లో చర్చ

ఈ నెల 5న జరగనున్న మెగా పేరెంట్, ఉపాధ్యాయ మీట్‌లో టెన్త్ విద్యార్థుల ప్రతిభపైన తల్లిదండ్రులతో చర్చ జరగనుంది. ఎస్ఐ పరీక్షలలో విద్యార్థులకు వచ్చిన మార్కులు బట్టి ప్లాన్ రూపుదిద్దనున్నారు. టెన్త్ విద్యార్థుల ప్రొగ్రెస్ రిపోర్ట్ క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థికి ఏవిధంగా బోధన అవసరంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిర్ణయానికి రావాల్సి ఉంది.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యార్థులు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి కాగా రేపటికి 100 రోజులు ఉంది. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిలవాలనే ప్రణాళిక నడుస్తుంది. గత ప్రభుత్వ హయాంలో చివరి మూడు సంవత్సరాలు ప్రభుత్వ విద్యార్థులు టెన్‌లో 50 శాతం లోపు ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్ వారు 90 శాతం పైన ఉన్నారు. గత ఏడాది 70 శాతం ఉత్తీర్ణతగా ప్రభుత్వ విద్యార్థులు నిలిచారు. ప్రైవేట్ విద్యార్థులు 90 శాతంగా ఉత్తీర్ణత సాధించారు. 2025-26 విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత వైపు ప్రభుత్వ విద్యార్థులు నడిచేలా ప్రణాళిక ఏర్పాటు చేశారు.

6 నుంచి 100 రోజుల కార్యాచరణ అమలు



భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ ప్రారంభించండి


రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రమిస్తున్న ఎంపీ మహేశ్

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం -కొవ్వూరు రైల్వేలైన్, ఆర్వోబీ పనులను ప్రారంభించి త్వరితగ తిన పూర్తి చేయాలని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఢిల్లీలో రైల్వే మంత్రిని బుధవారం కలసి రాష్ట్ర సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎంపీ మహేశ్ మాట్లాడుతూ భద్రాచలం- కొవ్వూరు రైల్వేలైన్‌కు 100 శాతం రైల్వే నిధులు కేటాయించాలని కోరామన్నారు. 11 ఆర్వోబీలకు కేంద్రం అనుమతి ఇచ్చినా పనులు మొదలు కాలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారన్నారు.

రొయ్యల వినియోగాన్ని ప్రోత్సహించాలి


రాజ్యసభలో మాట్లా డుతున్న ఎంపీ పాకా

భీమవరం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మన ఆక్వా ఉత్పత్తులకు అంతర్జాతీయ ఎగుమ తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్న తరుణంలో ఆత్మనిర్భారత్ పథకంలో మన రొయ్యలను స్థానిక వినియోగానికి ప్రోత్సాహం కల్పించాలని, దీనివల న ఆక్వారైతులు ఎగుమతుల సంక్షోభాలను అధిగమించటానికి వీలుంటుందని రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ అన్నారు. రాజ్యసభ సమావేశాలలో బుధవారం ఆక్వా రైతుల సమ స్యలపై ప్రసంగించారు. ముఖ్యంగా రొయ్యలు చేపల ఎగుమతులకు ఉన్న అవరోధాలను అధిగమిం చడానికి ఆయన కొన్ని సూచనలు చేశారు. ప్రస్తుతం మన ఆక్వా మార్కెట్ అంతర్జాతీయంగా 75 శాతం వాటాతో గ్లోబల్ లీడర్‌గా ఉందన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 70 శాతం వాటా ఉందన్నారు. కొంతకాలంగా మన వ్యాపా రంపై అమెరికా వాణిజ్య ఆంక్షలు విధించిన నేపథ్యం లో అంతర్జాతీయంగా మన ఆక్వా ఎగుమతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. రోజువారి ఆహారంలో ఆక్వా ఉత్పత్తులు తినడం చాలా ఆరోగ్యకరమన్నారు. వీటిని తీసు కోవడం వల్ల శరీరానికి మంచి ప్రోటీన్ అందుతుందన్నారు. అందువలన ప్రధానంగా రక్షణ శాఖలో సిఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్ లాంటి డిఫెన్స్ విభాగంలో ఉన్న క్యాంటీన్లకు ఈ ఆక్వా ఉత్పత్తులను చేర్చాలని, దీనికి సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే విద్య శాఖకు సంబంధించి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకానికి, అంగన్‌వాడీ విద్యార్థులకు పోషక ఆహారంలో భాగంగా ఆక్వా ఉత్పత్తులను అందించవచ్చు అన్నారు.

ప్రత్యేక శ్రద్ధతో ప్రాజెక్టులు పూర్తిచేయాలి


సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రాజెక్ట్ ల పనితీరుపై శాసనసభ పబ్లిక్ అ కౌంట్స్ కమిటీ నిర్వహించిన సమీ క్షా సమావేశంలో కమిటీ సభ్యుడి హోదాలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధా కృష్ణ పాల్గొన్నారు. అమరావతిలోని అసెంబ్లీ సమావేశ మందిరంలో నిర్వ హించిన సమావేశాన్ని నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ సభ్యులు, అధికారులు రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్ట్‌లపై సమీక్ష చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్ వివరాలు, ఖర్చులు పరిశీలించారు. ముఖ్యమైన వాటిని ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేయాలని సభ్యులు కోరారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు దరఖాస్తు చేయండి

ఏలూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. జిల్లాలో భర్తీ చేసే స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు నెలకు రూ.12,500లు గౌరవ వేతనంగా చెల్లిస్తారని వివరించారు. ఏలూరు 7వ డివిజన్ మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూలులో ఒక ఉర్దూ పోస్టు, మౌలానా అబుల్ కలాం అజాద్(మాకా) హైస్కూలులో ఉర్దూ, భౌతిక శాస్త్రం, గణితం పోస్టులు, కైకలూరు మండలం ఆటపాక జడ్పీ హైస్కూలులో సంస్కృతం, కలిదిండి మండలం మట్టగుంట జడ్పీ హైస్కూలులో హిందీ, నూజివీడు మండలం ముక్కొల్లుపాడు మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూలులో జీవశాస్త్రం పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చున న్నారు. సంబందిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 5వ తేదీలోగా అక్కడే దరఖాస్తులను అందజేయాలని కోరారు. దరఖాస్తు ఫారం నమూనా ఎంఈవో కార్యాలయంలో అందుబాటులో ఉంచామన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

ఏలూరు టూటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):శబరిమలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్‌లో ప్రత్యేక రైళ్ల గురించి ఎంపీ మహేశ్ అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందించారు. విశాఖపట్నం నుంచి 20, కాకినాడ నుంచి 18 ప్రత్యేకరైళ్లు శబరిమలకు ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

ఆదివాసి అంధ క్రికెటర్‌కు అభినందన


ఆర్థిక సహాయం అందిస్తున్న ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జగదీశ్వరి

పోలవరం డిసెంబరు, 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన తొలి మహిళా ప్రపంచ అంధుల క్రికెట్ కప్ పోటీలలో భారత జట్టు విజయం సాధించడంతో కీలకపాత్ర పోషించిన ఆదివాసి అంధ మహిళా క్రికెటర్ కరుణకుమారిని బుధవారం ఏపీ స్పోర్ట్స్ అథార్టీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశ గౌరవాన్ని నిలబెట్టిన ఆదివాసి మహిళా క్రికెటర్ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన మహిళా క్రికెటర్‌కి 20 వేల రూపాయలు ప్రోత్సాహకంగా అందజేశారు.

వాలీబాల్ విజేత: డీఆర్‌జీ కళాశాల


కప్ సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

పెంటపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని ప్రిన్సి పాల్ డాక్టర్ ఎన్. వెంకటే శ్వరరావు అన్నారు. నరసా పురం వైఎన్ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్, కప్పు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా మెడల్ సాధించిన విద్యార్థులను, విజయంలో కృషి చేసిన స్పోర్ట్స్ ఇన్‌చార్జిలు విజయ్‌బాబు, అంజిబాబులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వం సానుకూలం



మాట్లాడుతున్న ఏపీ ఎన్‌జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

భీమవరం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల డిమాండ్స్ గత ప్రభుత్వం నుంచి పేరుకుపోయాయని, ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడానికి ఏపీ ఎన్జీవో సంఘం బాధ్యత తీసుకున్నదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. భీమవరంలో జిల్లా ఏపీ ఎన్‌జీవోల అసోసియేషన్ అడహక్ కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్న సందర్భంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించటంలో సుముఖంగా ఉందని, అందులో భాగంగా సుమారు రూ.11వేలకోట్లు ఉద్యోగుల ఖాతాల్లో జీపీఎఫ్ తదితర సొమ్ములు పడ్డాయని తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు పెండింగ్ బకాయిలు సుమారు రూ.3,200 కోట్లు ప్రాన్ అకౌంట్స్‌లో జమ చేసేలా ఏపీ ఎన్జీవో సంఘం కృషి చేసిందన్నారు. హెల్త్‌కార్డ్ సరిగా వినియోగంలోకి రావటం లేదని దీని వలన ఉద్యోగవర్గం తీవ్రంగా నష్టపోతున్నారని,ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి డీవీ రమణ, చోడగిరి శ్రీనివాసరావు, నెరుసు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవోల జిల్లా అడహక్ కమిటీ ఎన్నిక

ఏపీ ఎన్జీజివోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు జిల్లా సంఘం అడహక్ కమిటీ ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా ఉదిసి వెంకట పాండురంగారావు, కన్వీనర్‌గా పోతన సుకుమార్, కో- చైర్మన్‌గా అల్లూరి శ్రీనివాస రాజు, కో-కన్వీనర్లుగా ఎంఆర్‌కె రాజు, దేవాబత్తుల నాగ దేవి, ఇంజేటి రమేష్, సుంకర వెంకటేష్‌లను ప్రకటిచారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెనుమరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శులు శివ ప్రసాద్, రాం ప్రసాద్, జేఏసీ నాయకులు ఆర్‌ఎస్ హరనాథ్, రాష్ట్ర ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాము శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా భీమవరం పాత బస్ స్టాండ్ నుంచి బైక్ ర్యాలీగా త్యాగరాజ భవన్ వరకు సాగింది.

నేడు డీఎల్‌డీవో కార్యాలయాల ప్రారంభం

ఏలూరు సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయటానికి, డివిజన్‌స్థాయిలో పంచాయతీరాజ్ కార్యకలాపాలు నిర్వహించటానికి డీఎల్‌డీవో కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాల్లో ప్రత్యేకంగా డివిజనల్ స్థాయిలోని అధికారులు పాలన నిర్వహిస్తారు. పంచాయతీ కార్యకలాపాలతో పాటు, ఉపాధి హామీ కార్యకలాపాల నిర్వహణను ఈ కార్యాల యాల ద్వారా డివిజినల్ స్థాయి అధికారులైన డీడీవో, డీఎల్‌డీవో, డ్వామా ఏపీడీలు దిగువ స్థాయిలో జరిగే కార్యక్రమాలను పర్యవేక్షణ చేయటం జరుగుతుంది. ఈ డీఎల్‌డీవో కార్యాలయాలను ఈనెల 4వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ పర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడులలోను, పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంలలోను, తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరులోను ఈ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. ఈ కార్యాలయాల నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధులు 67 లక్షలు రూపాయలు కేటాయించారు. ఇప్పటివరకు జిల్లాలో డివిజన్ స్థాయిలో రెవెన్యూ శాఖకు సంబంధించి ఆర్డీవో కార్యాలయం, పోలీస్ శాఖకు సంబంధించి డిఎస్పీ కార్యాలయం ఉండేవి. తాజాగా పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించి డివిజనల్ స్థాయి కార్యాలయాలు ఏర్పాటు అయ్యాయి.

డీఎల్‌డీవో కార్యాలయాల ప్రారంభోత్స వాన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజలు వీక్షించటానికి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని వీక్షించటానికి ఏర్పాట్లు చేశారు.

డీడీవో అధికారులు వీరే

పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నూతనంగా నిర్మితమైన డీఎల్‌డీవో కార్యాలయాలకు డీడీవోలుగా పనిచేస్తున్న అధికారులు వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు డీడీవోగా ఏబీపీవీ లక్ష్మి, జంగారెడ్డిగూడెం డీడీవోగా ఎం. రాజు, నూజివీడు డీడీవోగా పి.వెంకటరత్నం, భీమవరం డీడీవోగా వై.దోసిరెడ్డి, నరసాపురం డీడీవోగా జి.రాణి, తాడేపల్లిగూడెం డీడీవోగా ఎం.ప్రభాకరరావు, కొవ్వూరు డీడీవోగా ఏఎస్ రెడ్డి పనిచేస్తున్నారు. డీడీవోల ఆధ్వర్యంలోనే ఈ కార్యాలయాలు పనిచేయటం జరుగుతుంది. పంచాయతీరాజ్ కార్యకలాపాలను వికేంద్రీకరించటానికి ఈ డివిజినల్ వ్యవస్థ దోహదపడుతుందని చెబుతున్నారు.

సమస్యలకు సాంకేతిక పరిష్కారాన్ని కనుగొనాలి

ఏపీ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మధుమూర్తి

భీమవరం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజంలో సమస్యలు గుర్తించి వాటికి సరైన సాంకేతిక పరిష్కారాన్ని కనుగొనాలని ఏపీ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి సూచించారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో అంగవైకల్యం కలిగిన స్కూల్ విద్యార్థులకు సాంకేతిక సహాయక ఉపకరణాలను అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.మధుమూర్తి మాట్లాడుతూ విష్ణు కళాశాలలో అసిస్టెవ్ టెక్నాలజీ లేబొరేటరీలను స్థాపించి సాంకేతిక విజ్ఞాన ఆవిష్కరణలను సమాజ సేవకు ఉపయోగపడేలా చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని ఇప్పటికే గూగుల్ సంస్థ వస్తుంద న్నారు. విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు మాట్లాడుతూ కళాశాలలో అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మాసాచుసెట్స్‌తో భాగస్వామ్యం ఏర్పరచుకుని అసిస్టెవ్ టెక్నాలజీ లేబొరేటరీలను ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ యువీ రమణరాజు మాట్లాడుతూ కళాశాలలో లేబొరేటరీని స్థాపించిన 16 సంవత్స రాల నుంచి వికలాంగులకు సహాయ పరికరాలు అందించడం గొప్పవిషయమన్నారు.

నేత్రపర్వం.. సుదర్శన హోమం


సుందరగిరిపై నారసింహుని మూలవిరాట్‌కు హారతి ఇస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువుదీరిన లక్ష్మీనారసింహుని ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు బుధవారం జరిగిన ప్రదోష సాలిగ్రామ అభిషేకం భక్తులను పరవశింపజేసింది. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో పరిసరాలను సుందరీకరించారు. అనంతరం ఆలయంలో పుణ్యాహవచన, కలశస్థాపన నిర్వహించారు. ఆ తరువాత వేదమంత్రోచ్చరణల నడుమ శ్రీనారసింహుని మూలవిరాట్‌కు విశేష ద్రవ్యాలతో అభిషేకం, హారతులు ఇచ్చారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ వారి హుండీ ఆదాయం రూ.3.12 కోట్లు



ద్వారకాతిరుమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామికి హుండీల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. గడచిన 29 రోజుల కాలానికి గాను జరిగిన ఈ లెక్కింపులో శ్రీ స్వామివారికి నగదు రూపేణా రూ.3.12 కోట్ల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. స్థానిక ప్రమోద కల్యాణ మండప ఆవరణలో అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపును నిర్వహించారు. హుండీల ద్వారా లభించిన 3,12, 30,225 రూపాయల నగదుతో పాటుగా భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 392 గ్రాముల బంగారం, 5.659 కేజీల వెండి లభించినట్లు ఈవో వివరించారు. అలాగే రద్దయిన పాతనోట్లు రూ.500 (4), 2000 (12)తో పాటుగా విదేశీ కరెన్సీ సైతం అధికంగా లభించింది.

నేడు పోలవరానికి మంత్రి నిమ్మల రాక

పోలవరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భారీ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు రానున్నారు. ఉదయం 9 గంటలకు మంత్రి పోలవరం ప్రాజెక్టుకి చేరుకుంటారు. ముందుగా మంత్రి పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ కనెక్టివిటీలో జంటగుహల నిర్మాణపు పనులను పరిశీలిస్తారు. అనంతరం గ్యాప్ 1, 2 పనులను, ఎర్త్‌కం రాక్ఫిల్ డ్యాం పనులు పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు పనుల పురోగతిపై జలవనరులశాఖ అధికారులు, ఏజన్సీల ప్రతినిధులతో పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.

అక్రమ కట్టడాల కొలతల సేకరణ

జంగారెడ్డిగూడెం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):మైసన్నగూడెం ప్రభుత్వ రాళ్లగు ట్ల పోరంబోకు భూముల ఆక్రమణ, అక్రమ కట్టడాలపై ఈనెల 2వ తేదీన ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై పంచాయతీ, రెవెన్యూ అధికారుల విచారణ కొనసాగుతోంది. సదరు భూమిలో దాదాపు 10 నుంచి 15 మంది అక్ర మ నిర్మాణాలు చేసినట్టు నిర్ధారణ చేసుకుని వారికి నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. జంగారెడ్డిగూడెం ఆర్డీ వో రమణ ఆదేశాల మేరకు తహసీల్దార్ స్లీవజోజి సంఘటన స్థలాన్ని పరిశీలించి అక్క డ అక్రమ కట్టడాల కొలతలను సేకరించారు. దీనిపై ఉన్నతాధికారులకు మంగళవారం రాత్రి నివేదిక పంపినట్టు సమాచారం. అలాగే ఆక్ర మణలకు పాల్పడిన దాదాపు 10 నుంచి 15 మందికి గురువారం నోటీసులు ఇవ్వను న్నారు.

భవానీ మాలధారుల ఆందోళన


స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న భవానీలు

నరసాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భవానీ మాల ధరించి స్కూల్‌కు వచ్చిన విద్యార్థినీని లోనికి అనుమతించకపోవడంతో భవానీలతో కలిసి తల్లిదండ్రులు ఆందోళనకు దిగడంతో పట్టణంలోని సికిలి స్కూల్ వద్ద బుధవారం నాలుగు గంటలు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని భవానీ మాలతో స్కూల్‌కు వచ్చింది. అయితే ఆ విద్యార్థినీని స్కూల్ సిబ్బంది తరగతి గదిలోకి అనుమతించలేదు. దీంతో విద్యార్థిని తండ్రి ప్రిన్సిపాల్ సుచరితతో చర్చించారు. కరస్పాండెంట్ అనుమతి తీసుకునే భవానీని స్కూల్‌కు తీసుకొచ్చామని చెప్పే ప్రయత్నం చేశారు. అయితే సిబ్బంది ఒప్పుకోలేదు. సీబీఎస్ఈ నిబంధనల ప్రకారం డ్రెస్ కోడ్ తప్పనిసరన్నారు. అవసరమైతే మాల గడవు ముగిసే వరకు విద్యార్థినికి హాజరు వేస్తామని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. దీనికి విద్యార్థిని తల్లిదండ్రులు అంగీకరించలేదు. ముందుగా లెటర్ పెట్టుకున్న తరువాతే విద్యార్థినికి మాల వేశామని, ఇప్పుడు రూల్స్ చెబితే ఎలా అంటూ వాదానికి దిగారు. అయినప్పటికి సిబ్బంది ఒప్పుకోకపోవడంతో గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు భవానీలు స్కూల్ వద్దకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఇటు వీహెచ్‌పీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు కూడా తరలివచ్చి విద్యార్థిని తల్లిదండ్రులకు సంఘీ భావం చెప్పారు. వీరంతా ఆందోళనకు దిగడంతో స్కూల్ వద్ద హై టెన్షన్ నెలకొంది. సమాచారం తెలుసుకున్న ఎంఈవోలు పుష్పరాజ్యం, జాన్‌కుమార్, సీఐలు యాదగిరి, దుర్గాప్రసాద్, ఎస్సై సురేష్ కూడా సిబ్బందితో స్కూల్ వద్దకు వచ్చారు. ఆందోళన చేస్తున్న వారంతా స్కూల్ ప్రాంగణంలోకి దూసుకెళ్లారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సరస్వతి దేవి, భరతమాత, అంజనేయస్వామిల చిత్రపటాలు తీసుకెళ్లి స్కూల్ ప్రాంగణంలో పెట్టారు. చివరికి ప్రిన్సిపాల్ సుచరిత రాజీనామా చేస్తున్నట్లు లిఖితపూరికంగా రాసి ఇచ్చారు. మాలతో ఉన్న విద్యార్థినీని లోనికి అనుమతించడంతో ఆందోళన విరమించారు. గతంలో కూడా ఇదే స్కూల్‌లో ఇలాంటి సంఘటనే చోటు చేసుకొన్నది. మళ్లీ మరోసారి వెలుగచూడటం గమనార్హం,


ఎస్పీ నయీం అస్మిని సన్మానిస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్.. చిత్రంలో సీఐ కాళీచరణ్ తదితరులు

ఎస్పీ, సీఐలకు సన్మానం

భీమవరం క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భీమవరం రెండవ పట్టణంలో ఒక ఇంజనీరింగ్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ శర్మ అనే వ్యక్తి డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసపోయి రూ. 78.60 లక్షలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. దీనిపై మోసపోయానని తెలుసుకున్న తర్వాత భీమవరం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ కాళీచరణ్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో ప్రత్యేక టీమ్‌లు పెట్టి మొత్తం మీద 13 మందిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడిని అరెస్ట్ చేయవలసి ఉంది. అయితే ఈ కేసులో రూ. 42 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. దాంతోపాటు రూ. 19 లక్షలను బ్యాంక్‌లో ఫ్రీజ్ చేశారు. మొత్తం మీద రూ. 61 లక్షలు బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రొఫెసర్ శర్మ బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకుని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మిని, టూటౌన్ సీఐ కాళీచరణ్‌ను ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

మెడికోల ఘర్షణపై కేసు నమోదు

ఏలూరు క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):మెడికల్ కళాశాల విద్యార్థుల దాడి సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి గాది రాకేష్‌రెడ్డిపై మూడో సంవత్సరం చదివే విద్యార్థులైన సిద్ధార్థ, రాయుడు, మనీష్, జోషి మరికొంత మంది కలిసి ఈనెల 1వ తేదీ రాత్రి ఏలూరు మెడికల్ కళాశాల హాస్టల్ వద్ద దాడి చేశారని బాధితుడు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు టూటౌన్ పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు కోడికత్తుల తయారీదారుల అరెస్టు

500 కత్తులు స్వాధీనం




అరెస్టయిన కత్తుల తయారీదారులు (ఇన్‌సెట్‌లో) స్వాధీనం చేసుకున్న కత్తులు

పెదవేగి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో కోడికత్తులు తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని పెదవేగి సీఐ సీహెచ్.రాజశేఖర్ తెలిపారు. కోడికత్తులను తయారు చేస్తున్నారనే పక్కా సమాచారంతో బుధవారం రాత్రి దాడిచేసి, కోడికత్తులు తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని చెప్పారు. వారివద్దనుంచి 500 కత్తులను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ముగ్గురు నిందితులతోపాటు కత్తులు తయారు చేసే రెండు యంత్రాలను కూడా సీజ్ చేశామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమయంలో కోడిపందాల నిర్వహణ కోసం పందాలరాయుళ్లు ప్రయత్నాలు ప్రారంభించారన్నారు. ఈ క్రమంలో కత్తులను తయారు చేయిస్తున్నారని తెలిపారు. ఎవ్వరైనా కోడి పందాలు వేసినా, కత్తులు తయారు చేసినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పండుగ అంటే ఇంటిల్లపాది ఆనందంగా గడపాలే తప్ప జంతుహింసతో ఆనందం పొందడం సరైన విధానం కాదని ఆయన హితవు పలికారు. పండుగ సమయంలో ఆనందం కోసం ఆరోగ్యకరమైన ఆటలపోటీలు వంటివాటిని ఎంపిక చేసుకోవాలే తప్ప, కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లవద్దని ఆయన సూచించారు.

ఇద్దరు వాకర్స్‌ను ఢీకొన్న కారు

ఒకరు మృతి.. మరొకరికి గాయాలు


మృతి చెందిన ఘంటసాల రంగబాబు

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉదయాన్నే వాకింగ్ చేస్తున్న ఇద్దరిని అతి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలోని గురకలపేటనకు చెందిన మద్రాపు రంగారావు అతని స్నేహితులు అయిన శ్రీపర్రునకు చెందిన ఘంటసాల రంగబాబు, ఇందుకూరి సుబ్బరాజులు కలిసి బుధవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో శ్రీపర్రు నుంచి ఏలూరు వైపు వాకింగ్‌కు వస్తున్నారు. కైకలూరు వైపు నుంచి ఒక కారు అతివేగంగా వచ్చి వారిని ఢీ కొంది. ఈప్రమాదంలో ఘంటసాల రంగబాబు అక్కడికక్కడే మృతి చెందగా సుబ్బరాజు తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ ఎస్ఐ బి నాగబాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అతి వేగంగా కారు నడిపిన కైకలూరు మండలం బుజబలపట్నంనకు చెందిన వేగేశ్న సుధీర్‌రాజు (37) పై కేసు నమోదు చేశారు. మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెంటపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆకుతీగపాడు గ్రామానికి చెందిన కొల్నాటి శ్రీదేవి (46) వృత్తి రీత్యా హైదరాబాదులో నివాసం ఉంటుంది. పింఛన్ తీసుకునేందుకు తన స్వగ్రామం వచ్చింది. తిరిగి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా పెంటపాడు ఎస్‌టీవీఎన్ సమీపంలో చెప్పు పడిపోతుందని తీసుకునే క్రమంలో రోడ్డుపై పడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి బంధువులు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి శ్రీదేవి మృతి చెందిందని మృతురాలి సోదరుడు నాగసత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాజేంద్ర తెలిపారు.

దొంగనోట్ల కేసులో ఐదుగురి అరెస్టు

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒక బ్యాంక్ ఏటీఎంలో దొంగనోట్లను పెట్టి ఒక మహిళ అకౌంట్‌కు డిపాజిట్ చేయడానికి ప్రయత్నించిన కేసులో ఐదుగురిని ఏలూరు రూరల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చాటపర్రులో ఉన్న కెనరా బ్యాంక్ ఆవరణలో ఉన్న ఏటీఎంలో దొంగనోట్లను డిపాజిట్ చేయడానికి ప్రయత్నించారు. అయితే బ్యాంకు అధికారులు ఆనోట్లను గుర్తించి అవి ఏ సమయంలో ఆ నోట్లను జమ చేశారో సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించి ఈ ఏడాది మే నెలలో ఫిర్యాదు చేశారు. దీంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి ఈ కేసును దర్యాప్తు చేశారు. ఈకేసులో ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామానికి చెందిన (ప్రస్తుతం ఏలూరు తూర్పువీధి) సైదు సతీష్ (22), ఏలూరు రూరల్ మండలం చాటపర్రుకు చెందిన కొలుసు జయంత్ (22), ఏలూరు తూర్పువీధినకు చెందిన వేమాల శివ (41), ఏలూరు రూరల్ మండలం వైఎస్ఆర్ కాలనీకి చెందిన గొరిపర్తి నాగబాబు (28), తణుకు రూరల్ మండలం గరగపర్రుకు చెందిన చెన్నా వెంకట సూర్యనారాయణ (22)లను కోర్టుకు హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.

నేడు డీఎల్‌డీవో కార్యాలయ ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం డీఎల్‌డీవో కార్యాలయం పెదతాడేపల్లిలో గురువారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్టు డీఎల్‌డీవో ఎం.ప్రభాకర్ తెలిపారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. డివిజన్ స్థాయిలో పంచాయతీరాజ్ కార్యకలాపాలు నిర్వహించడానికి డీఎల్‌డీవో కార్యాలయాలను ఏర్పాటు చేశారు. పంచాయతీ, ఉపాధి హామీ కార్యకలాపాల నిర్వహణను డీడీవో, డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ పర్యవేక్షిస్తారు.

నేడు తణుకులో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తణుకు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వర్ణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చిట్టూరి సుజాత, కేవీఎల్ పద్మావతి, అధ్యక్ష, కార్యదర్శులు బూరుగుపల్లి వెంకటరావు, సుంకవల్లి చిరంజీవి కుమారి, తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తణుకు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే శిబిరంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యుల సహకారంతో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పేర్ని నాని ఒక అరాచకవాది : ఎమ్మెల్యే బొలిశెట్టి


విలేకరులతో మాట్లాడుతున్న బొలిశెట్టి

తాడేపల్లిగూడెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు పేర్ని నాని ఒక అరాచకవాది అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆరోపించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఎక్కే విమానాలు కూలిపోవాలన్న పేర్ని నాని వ్యాఖ్యలపై శ్రీనివాస్ మండిపడ్డారు. వైఎస్ రాజశేఖరరెడ్డి విమానం ప్రమాదంలో చనిపోయినట్లు అందరికి అలా జరగాలని పేర్ని నాని కోరుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాని వ్యాఖ్యలతో కూటమి నాయకులపై వైసీపీ కుట్ర బయటపడిందన్నారు. రాష్ట్రం మీ వల్ల నాశనమైందన్నారు. మర్యాదగా మాట్లాడితే తాము కూడా మర్యాదగా మాట్లాడతాం అని బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.

వైసీపీ నేతలను వేధిస్తే ఊరుకోం : శ్రీరంగనాథరాజు

ఆచంట, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ నాయకులను, ప్రజా ప్రతినిధులను రాజకీయకక్ష, విచారణ పేరుతో వేధింపులకు గురి చేస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు హెచ్చరించారు. తూర్పుపాలెంలో బుధవారం స్థానిక ప్రజా ప్రతినిధుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. ఈ నెల7 లోపు మెడికల్ కళాశాలల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ఉద్యమం పూర్తయ్యేలా నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గుంటూరి పెద్దిరాజు, కర్రి వేణు బాబు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తణుకు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ ఈనెల 13న జరుగుతుందని, కేసుల రాజీకి పోలీసులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డి.సత్యవతి కోరారు. పోలీసు అధికారులు, న్యాయవాదులతో బుధవారం సమావేశం నిర్వహించారు. తణుకు కోర్టు పరిధిలో సివిల్, చెక్ బౌన్స్, టెలిఫోన్ బిల్లులు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులను ఎక్కువగా రాజీ జరిగేలా కృషి చేయాలని కోరారు. న్యాయాధికారులు కె.కృష్ణ సత్యలత, సాయిరాం పోతార్లంక, కె.కృష్ణవేణి, తాడి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

కాళ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. బొండాడ గ్రామంలో బుధవారం నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా బీఎన్‌ఎస్, బీఎన్‌ఎస్‌ఎస్ చట్టాల గురించి గ్రామస్తులకు ఎస్‌ఐ వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మన్నె నాగరాజు, కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం


దాణా అందజేస్తున్న చిలుకూరి బాలాజీ

యలమంచిలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని, పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శిరగాలపల్లి సొసైటీ చైర్మన్ చిలుకూరి బాలాజీ అన్నారు. శిరగాలపల్లిలో బుధవారం నిర్వహించిన పశువుల దాణా పంపిణీలో ఆయన పాల్గొన్నారు. శిరగాలపల్లి, యలమంచిలిలంక, కట్టుపాలెం, లక్ష్మీపాలెం గ్రామాల్లోని 60మంది పాడి రైతులకు 50శాతం రాయితీపై పశువుల దాణా అందజేశారు. మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి, టీడీపీ నాయకుల టీవీవీ.నాగప్రసాద్, చంద్ర పాల్, సీతారాముడు, తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: పశువుల యజమానులకు 50శాతం రాయితీతో దాణా సరఫరా చేశారు. యడ్లబజారులోని పశు వైద్యశాల వద్ద జరిగిన కార్యక్రమానికి పశు సంవర్థక శాఖ ఏడీ జి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాణా అందజేశారు. గండేటి వెంకటేశ్వరరావు, చోడిశెట్టి జ్ఞాన శంకర్, మండెల రాంప్రసాద్, వల్లభు శ్రీనివాస్, మీసాల రాము, గాదె వెంకన్న పాల్గొన్నారు. గాదె వెంకన్న పశు వైద్యశాల అభివృద్ధికి రూ.10.116 అందజేశారు

సాంస్కృతిక కార్యక్రమాలతో మానసిక వికాసం


బహుమతులు అందుకున్న విజేతలు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో మానసిక వికాశం కలుగుతుందని ఏఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ 1, 2యూనిట్ల ఆధ్వర్యంలో అడవిపాలెంలో శిబిరం ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రోగ్రాం అఫీసర్లు ఎం.రామకృష్ణ, వి.విజయలక్ష్మి మాట్లాడుతూ వారం రోజులుగా చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. చెరుకూరి అంజిబాబు, అధ్యాపకులు బూసి వెంకటస్వామి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆర్‌వోబీల నిర్మాణానికి సర్వే


నవాబుపాలెంలో సర్వే నిర్వహిస్తు అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఆర్‌వోబి ఏర్పాటుకు నవాబుపాలెం, ప్రత్తిపాడు ప్రాంతాల్లో బుధవారం సర్వే చేశారు. ప్రత్తిపాడు- ఆరుగొలను మధ్య రైల్వేగేటు, నవాబుపాలెం రైల్వేగేటు వద్ద ఆర్‌వోబి ఏర్పాటుకు డివిజినల్ సర్వేయర్ రౌతు రామకృష్ణ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. సర్వేయర్ కె.నవీన్, జి.హేమంత్, ల్యాండ్ సర్వే అధికారి దీప్తి లాస్య, వీఆర్‌వో మంగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లలకోడేరులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పాలకోడేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ఆశీస్సులతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని జడ్పీటీసీ పెద్దిశెట్టి లక్ష్మీతులసి అన్నారు. గొల్లలకోడేరులోని తుమ్మలగుంటపాలెం నుంచి మహదేవపట్నం రహదారి నిర్మాణానికి లక్ష్మీతులసి బుధవారం భూమిపూజ చేశారు. జడ్పీ నిధుల ద్వారా అన్ని గ్రామాలకు నిధులు సేకరించి అభివృద్ధికి సహకరిస్తానన్నారు. మాజీ సర్పంచ్‌లు గాదిరాజు సూర్యనారాయణరాజు, పెద్దిశెట్టి సుబ్రహ్మణ్యం, పడమట బుజ్జి, వీరవల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధి

కాళ్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీసలిలో శ్మశాన వాటిక అభివృద్ధికి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు నిధులు సమకూర్చారని డీసీ చైర్మన్ తోట ఫణి బాబు అన్నారు. పనులను బుధవారం కూటమి నాయకులు పరిశీలించారు. టీవీవీ సత్యనారాయణ, నూకల వెంకటస్వామి, కొటికలపూడి నాగేశ్వరరావు, గణేశ్న వెంకట రామకృష్ణ, తోట మధు, నక్కా హరిబాబు పాల్గొన్నారు.

పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మీటర్లు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి వినియోగదారులకు సరఫరాలో లోపాలు లేకుండా ఎల్‌టీ టీవీఆర్ మీటర్లు బిగిస్తున్నారు. ట్రాన్స్‌కో పట్టణ ఏఈ షేక్ బాబ్జీ మాట్లాడుతూ ఈ మీటర్ల వల్ల సరఫరా, వినియోగం తెలుసుకోవచ్చన్నారు. పట్టణంలో 500 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి, 150 ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు అమర్చడం జరిగిందన్నారు.


అత్తిలి మండలం స్కిన్నెరపురంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, భీమవరం మండలం తుందుర్రు, నరసాపురం మండలం తూర్పుతాళ్ల, పాలకొల్లు మండలం ఎస్.చిక్కాల గ్రామాల్లో తోట సీతారామలక్ష్మి, పొత్తూరు, విజయ భాస్కర్

వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం

రైతులకు మేలు

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

అత్తిలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో నూతన సాంకేతికతను జోడించి ఆదాయం పెంచుకోవాలని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. స్కిన్నెరపురంలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన గ్రామస్థాయి కార్యాచరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. సేంద్రియ పద్ధతిలో ఆరోగ్యకరమైన పంటలను పండించాలని సూచించారు. రైతు సేవా కేంద్రంలో గోనె సంచులు, బరకాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వర్షాల నుంచి ధాన్యం కాపాడుకోడానికి రైతు సేవా కేంద్రాలు, సొసైటీల వద్ద బరకాలను అందుబాటులో ఉంచామన్నారు. గ్రామంలో రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యం పరిశీలించిన జేసీ తేమ శాతంపై రైతులను ఆరా తీశారు.

తణుకు రూరల్: ధాన్యం కొనుగోలులో తూకం, రవాణా నిబంధనలతో నష్టపోతున్నామని రైతులు అధికారులకు వివరించారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి కార్యాచరణ ప్రణాళిక సమావేశాల్లో బుధవారం వ్యవసాయాధికారులను రైతులు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. మండపాకలో ఏడీఏ జి.నరేంద్ర ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బలుసు సుబ్బారావు, చుంద్రు గణేష్, వట్టికూటి చెంచయ్య తదితరులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో జిల్లాకో విధానం రద్దు చేయాలన్నారు. తూకంలో నిబంధనల కారణంగా 75 కేజీల బస్తాకు రూ.26 ఖర్చువుతుండగా, ప్రభుత్వం క్వింటాకు (100 కేజీలకు) రూ.22 చెల్లిస్తుందన్నారు. రవాణా చార్జీలు రైతుకు టన్నుకు రూ.400 ఖర్చవుతుండగా, రూ. 320 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలులో పొరుగు జిల్లా రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను మించి లాభం పొందుతున్నారని, ఇదే విధానం మన జిల్లాలో కూడా అమలయ్యేలా చూడాలని కోరారు. ఏడీఏ నరేంద్ర రానున్న రబీ, ఖరీఫ్ సాగుపై ముందస్తు ప్రణాళికలపై రైతులతో చర్చించారు. ఆత్మకూరి రామకృష్ణ, వీవీవీ సత్యనారాయణ, పాల్గొన్నారు. వేల్పూరులో ఏవో కె.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావే శంలో ఏఎంసీ వైస్ చైర్మన్ వల్లూరి రామ్మోహన్, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. కోనాల, ముద్దాపురం, దువ్వ, తేతలి, కొమరవరం, యర్రాయిచెరువు, మహాలక్ష్మీ చెరువు గ్రామాల్లో సమావేశాల్లో జరిగాయి.

ఆకివీడు: రైతుల అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన గ్రామస్థాయి వ్యవసాయ ప్రణాళిక సమావేశంలో ఆయన మాట్లాడారు. పొలంబడి అధికారులు సక్రమం నిర్వహించడంలేదని, రైతులకు అవగాహన కల్పించడంలేదని, కొత్త విత్తనాలతో నష్టపోతు న్నామని, ఏవో రైతులను కలవడంలేదని రైతు చల్లారావు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారికి రైతులు ఫోన్‌చేస్తే స్పందించడం లేదన్నారు. అజ్జమూరు ఛానల్ తూడు తీస్తున్నామంటూ లాకులు ఎత్తడంతో కోత దశలో ఉన్న చేలు నీట మునిగాయని, నష్టం ఎవరిస్తారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గంధం ఉమా, గొంట్లా గణపతి, ఎంపీడీవో డి.బాబూరావు, ఏవో ప్రియదర్శిని, రైతులు పాల్గొన్నారు.

నరసాపురం రూరల్/మొగల్తూరు: ఆధునిక విధానాలతో సాగు చేస్తే దిగుబడి పెరుగుతుందని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. తూర్పుతాళ్ళు గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు అండగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మొగల్తూరు మండలం పేరుపాలెంలో నిర్వహించిన సమావేశంలో రామరాజు మాట్లాడుతూ రైతులకు అన్ని సదుపాయాలు, సబ్సిడీలు కల్పిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, సాగునీటి సంఘ అధ్యక్షుడు కడలి మోహనరావు, ఏవోలు జ్యోషిలా, అబ్దుల్ రహీమ్, శాస్త్రవేత్త శ్రీనివాస్, వినయ్‌లక్ష్మి, గుబ్బల నాగరాజు, సర్పంచ్‌లు పద్మారావు, సర్పంచ్‌లు పేరుపాలెం వెంకన్న, తిరుమాని లక్ష్మీ నర్సింహస్వామి, మేళం బన్ను, సత్తినేని త్రిమూర్తులు, హనుమంతు, పి.రాంబాబు పాల్గొన్నారు.

పెంటపాడు: రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ గంగాధరరావు అన్నారు. బుధవారం రావిపాడు, ప్రత్తిపాడు రైతు సేవా కేంద్రాలలో ఏవో చీర్ల రవికుమార్ అధ్యక్షతన రైతులతో సమావేశాలను నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ వచ్చే దాళ్వా పంటకు సంబంధించి ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు తదితర అంశాలపై కార్యాచరణ రూపొందించామన్నారు. ముల గాల శివ, ఒంగూరి శివ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: స్థానిక రైతు సేవా కేంద్రంలో ఏవో పి.సంధ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాలకోడేరు సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు మాట్లాడుతూ సాగుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రఘు, సొసైటీ వీఈవో పెనుమత్స నరసింహరాజు, కొత్తపల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: తుందుర్రు రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతన్నా మీ కోసం కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకని పంటలలో అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సొసైటీ అధ్యక్షుడు కొట్టు సురేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ సుజాత రామచంద్రరాజు, వీరస్వామి నాయుడు, ఏడీఏ శ్రీనివాస్, ఏవో ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్/యలమంచిలి: చంద్రబాబు పాలనలోనే రైతులకు మేలు జరుగుతుందని ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ అన్నారు. శివదేవుని చిక్కాల, యలమంచిలి మండలం నార్నిమెరక గ్రామాల్లో లో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాడిరైతులకు 50శాతం సబ్సిడీపై దాణా పంపిణీ చేశారు. పాముల రజనీకుమార్, కలిదిండి రామచంద్రరాజు, కామిశెట్టి అయ్యప్పనాయుడు, ఇంటి శ్రీరాముడు, మామిడిశెట్టి పెద్దిరాజు, చెరుకూరి అంజిబాబు, డేగల సత్యనారాయణ, పెన్మత్స రావభద్రరాజు, చిట్టూరి ఆంజనేయులు, ఏడీఏ వి.ప్రసాద్, ఏవో డి.బాలత్రిపురసుందరి, తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం (భీమవరం టౌన్): కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషిచేస్తోందని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో వీరవాసరం మండలం తోలేరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. వీరవాసరం ఎంపీపీ చంద్రశేఖర్ దుర్గభవాని, రైతు ప్రధాన కార్యదర్శి తమ్మినీడి నాగేశ్వరరావు, కూటమి నాయకులు ,వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు

క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవాలి


శిబిరంలో మాట్లాడుతున్న చైతన్యరాజు

పోడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక క్యాన్సర్‌పై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కిమ్స్, మెడ్ యునైటెడ్ హాస్పిటల్ చైర్మన్ కేవీవీ.సత్యనారాయణ రాజు సూచించారు. పోడూరులో పండేటి భూపతిరాజు సౌజన్యంతో బుధవారం జరిగిన క్యాన్సర్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. శిబిరంలో వైద్య బృందాలు సర్వికల్, రొమ్ము క్యాన్సర్లు, నోటి, లంగ్, ప్రొస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, రుద్రరాజు రమేష్‌రాజు, పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీవాసవి సుప్రజ, రుద్రరాజు శివాజీరాజు, రుద్రరాజు సుజాత తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో మెగా వైద్య శిబిరం

గణపవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం స్ఫూర్తిదాయకమని సినీ నిర్మాత సూర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. గణపవరంలో కన్యకాపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో మెగా వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య నిపుణులు ఎర్రా మాధురి, శ్వేత, తాడేపల్లి వంశీ, వినోద్, తదితరులు రోగులను పరీక్షించి మందులు అందించారు. అడవికొలను సర్పంచ్ పాల సత్యనారాయణ, నక్కా రామకృష్ణ, ఎస్.సత్యనారాయణరావు, ప్రకాశరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ


చెక్కులను అందజేస్తున్న వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అండగా ఉంటుందని భవన కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆకాశపు స్వామి, గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు తదితరుల పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాడేపల్లిగూడెం టౌన్, తాడేపల్లిగూడెం మండలం, పెంటపాడు మండలాలకు చెందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం అందజేశారు. 10 మందికి రూ.3,56,255 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పుల్లా బాబి, వర్తనపల్లి కాశీ, గుండుబోగుల సురేష్, పాలూరి వెంకటేశ్వరరావు, చెరుకూరి సోమశేఖర్, కొవ్వూరి లక్ష్మారెడ్డి, నరిసే సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాప్ ఆకస్మిక తనిఖీ

అత్తిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అత్తిలి మండలం స్కిన్నెరపురంలో 33 రేషన్‌షాప్‌ను జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ఈ పాస్ మిషన్ ద్వారా రేషన్ సరుకులు పంపిణీ విధానాన్ని స్వయంగా ఆయన పరిశీలించారు. ప్రతి నెల రేషన్ సరుకులు సక్రమంగా అందుతున్నాయా అని లబ్ధిదారులు అడిగి తెలుసుకున్నారు. ఏడీఏ సహాయ ఎంవీ.రమేష్, తహసీల్దార్ దశిక వంశీ, ఏవో టి రాజేష్, వెటర్నరీ, ఫిషరీస్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

సొసైటీల్లో అందుబాటులో బరకాలు

పెనుమంట్ర, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వర్షాలకు ధాన్యం తడిచిపోకుండా సొసైటీల్లో బరకాలు అందుబాటులో ఉంచాలని జేసీ టి రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. డివిజన్ సహకార అధికారి వారి పర్యవేక్షణలో పెనుమంట్ర మండలంలోని 15 ఆర్‌ఎస్‌కేలు, సొసైటీల్లో బరకాలను ఉంచారు. మండలంలోని రైతు లందరూ బరకాలను ఉపయోగించుకోవాని కోరారు. ధాన్యం కల్లాలలో ఉన్న రైతులు తమ దగ్గరలోని సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల నుంచి బరకాలను తీసుకుని ధాన్యం తడవకుండా భద్రపరుచుకోవాలని మండల్ లెవెల్ ఆఫీసర్ ఎంఎం రహమాన్ తెలియజేశారు. రైతులు ఉపయోగించుకొన్ని బరకాలకు ఎటువంటి చార్జి చెల్లించవలసిన అవసరం లేదని తెలిపారు.

స్వాములకు భిక్ష అందించిన దాతకు సత్కారం

పాలకోడేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరు గ్రామంలోని అయ్యప్పస్వామి మందిరంలో స్వామి మాలలు ధరించిన అయ్యప్పలకు, భవానీలకు, శివమాలలు ధరించిన భక్తులకు గత కొన్ని రోజులుగా అన్నదానం అందిస్తూ దాతలను సేకరించిన నారాయణ రెస్టారెంట్ యజమాని నేతల నారాయణను స్వాములు, మహిళలు, గ్రామస్తులు బుధవారం సత్కరించారు. నారాయణ మాట్లాడుతూ ప్రతి ఏడాది అయ్యప్ప మాలలు ధరించిన భక్తులకు అన్నదానం అందించడమే కాకుండా దాతలను సేకరిస్తూ ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని అన్నారు.

భక్తాంజనేయుడికి అభిషేకాలు


నాచువారి సెంటర్‌లో పంచముఖ ఆంజనేయుడు

భీమవరం టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హనుమద్ వ్రతం సందర్భంగా పంచారామ క్షేత్రమైన సోమేశ్వరస్వామి ఆలయంలోని భక్తాంజనేయస్వామికి ఉదయం అభిషేకాలు నిర్వహించారు స్వామివారికి లక్ష తమలపాకులు పూజ, సింధూరార్చన సాయంత్రం మన్యు హోమం నిర్వహించి ప్రత్యేకంగా అలంకారం చేసారు. భక్తులు దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

మారుతీ టాకీస్ సెంటర్‌లోని దాసాంజనేయ స్వామి ఆలయంలో హనుమద్వ్రతం సందర్భంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక అలంకారం చేశారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ముందుగా ఆలయంలో రమా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆలయ అర్చకులు ఘంటసాల పవన్ కుమార్ నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని అరటి పండ్లు, తమలపాకులతో పూజలు చేసి అలంకారంచేసారు. ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. నాచువారి సెంటర్‌లో పంచముఖ ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా హనుమద్వ్రతం

ఆకివీడు రూరల్ డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రామభక్త హనుమద్వ్రతం సందర్భంగా గ్రామాలలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కుప్పనపూడిలోని జయలక్ష్మి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని పెట్టారు. నంద్యాల సీతారామయ్య, భక్తులు పాల్గొన్నారు.

అత్తిలి: మండలంలో ఆంజనేయస్వామి ఆలయాలలో హనుమద్వ్రతం ఘనంగా నిర్వహించారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు వాడపల్లి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అల్లాబాని అప్పారావు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, పానకం వితరణ జరిపారు. అత్తిలి ఆంజనేయస్వామి వారి ఆలయంలో కూడా ఆలయ అర్చకులు చేబోలు భీమేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.

గణపవరం: గణపవరంలోని సంస్కృతి - కళా సాంగత్య ఆధ్వర్యంలో హనుమద్ వ్రతం వైభవంగా జరిగింది. పండితులు హనుమాన్ వ్రతాన్ని చేయించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో కృత్తికా దీపం

ఆకివీడు రూరల్ డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సిద్ధాపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం కృత్తికా దీపం వెలిగించారు. తమిళనాడులోని అరుణాచలం క్షేత్రంలో మార్గశిర మాసంలో పౌర్ణమి ముందు వచ్చే కృత్తికా నక్షత్రం రోజున కొండపై దీపం వెలిగిస్తారు. సిద్ధాపురంలో బుధవారం అదేవిధంగా భక్తులు కృత్తికా దీపాన్ని వెలిగించారు. భూపతిరాజు తిమ్మరాజు, పృథ్వీ దంపతులు, నున్న గణపతి, సత్యనారాయణ, గురువెల్లి గోపి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగులను మేధావులుగా తీర్చిదిద్దవచ్చు


విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ

పెంటపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక విద్యార్థులకు సరైన ప్రోత్సాహం అందిస్తే మేధావులుగా తీర్చిదిద్దవచ్చని ఎంఈవో ఎం.శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పెంటపాడు భవిత విద్యార్థుల పాఠశాలలో విద్యాకమిటి చైర్మన్ తాడేపల్లి మోహన్‌రావు విద్యార్థులకు స్టీల్ ప్లేట్‌లను అందజేశారు. ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు సాయి స్వరూప, సునీత తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: దివ్యాంగులు అనేక రంగాల్లో రాణిస్తున్నారని, వారి విజయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని భవిత కేంద్రం ఐఈఆర్‌టి శ్రీనివాసరావు అన్నారు. శ్రీరామ్‌పేట భవితా కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఐఈఆర్‌టి విటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు ఎంఈవో గంగాధర శర్మ, వీరాస్వామి అందజేశారు. కార్యక్రమంలో ఐఈఇర్‌టి కేవీజీఎస్.లక్ష్మి, వరలక్ష్మి సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం టౌన్, డిసెంబరు 3.(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రత్యేక చట్టాలు ఉన్నప్పటికీ అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దివ్యాంగుల సంక్షేమ సంఘ పట్టణాధ్యక్షుడు మేడపాటి రాఘవేంద్రరెడ్డి విమర్శించారు. గొల్లగూడెం సెంటర్‌లో రంగ బొమ్మ కూడలి వద్ద దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. దివ్యాంగులకు ప్రతి నియోజకవర్గంలో ఒక కమ్యూనిటి హాలు నిర్మించాలని, దివ్యాంగులు తోటి దివ్యాంగులను పెళ్లి చేసుకున్నప్పుడు ఇప్పుడు ఇస్తున్న దానికన్నా రెట్టింపు పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్త వీర్రాజు, పి.లక్ష్మణరావు, కె.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలి నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బాల్య వివాహాలు అరికడదాం

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 3.(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నేటికీ బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయని వాటిని అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ బాధ్యత వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.బేబీ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంట జడ్పీఉన్నత పాఠశాలలో బాల్యవివాహ ముక్త భారత్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం ర్యాలి నిర్వహించారు. జేమ్స్ గంగారత్నం, జి నాగమణి, పాఠశాల హెచ్‌ఎం ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: బాల్య వివాహాలపై బుధవారం పట్టణంలోని లెనిన్, మిషన్ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నతనంలో వివాహాలు చేసుకోవడం వల్ల అనర్థాలపై విద్యార్థులకు సీడీపీవో ఊర్మిళ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల హక్కులు, విధులు, మహిళ చట్టాలు, కిశోర బాలికలు తీసుకోవాల్సి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎన్ పద్మావతి, నహేమియా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అత్తిలి: అత్తిలిలో బాల్య వివాహ ముక్త భారత్ 100 రోజులు కార్యక్రమంలో భాగంగా బుధవారం జడ్‌పి గరల్స్ హైస్కూల్‌లో అత్తిలి సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహ నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహం వలన కలిగే అనర్థాలు మహిళా చట్టాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో బాల్య వివాహ ముక్త భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సత్యనారాయణ అధ్యాపకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

పాలకోడేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తాత్కాలిక పద్ధతిలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను ఐదు నెలల కాలానికి భర్తీ చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవో పెనుమత్స వెంకట శివనాగ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో నెలకు రూ. 12,500, సెకండరీ గ్రేడ్ టీచర్ కేటగిరిలో నెలకు రూ. 10 వేలు గౌరవ వేతనం చెల్లించే విధంగా పాలకోడేరు మండలంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. మోగల్లు పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి హిందీ పండిట్‌కు అర్హత కలిగిన ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తులు నేరుగా మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు. దరఖాస్తులు కావలసిన వారు ఎంఇవో కార్యాలయానికి వెళ్ళి తీసుకోవాలని కోరారు.

అత్తిలి: మండలంలోని లక్ష్మీనారాయణపురం ఉన్నత పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్ పోస్ట్‌లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌గా అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో ఎస్.రమేష్ కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం వీరికి నెలకు రూ.12,500 చెల్లిస్తారని తెలిపారు. ఐదు నెలలు కాల పరిమితికి పని చేయాల్సి ఉంటుందన్నారు. అర్హులు దారు ఈనెల 5 లోపు తన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పేరెంట్స్ మీటింగ్ విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాంప్రసాద్

పెంటపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఈ నెల 5న మెగా పేరెంట్స్ సమావేశాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో రాంప్రసాద్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సమావేశాలలో ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు, ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల నైపుణ్యాల పై తల్లిదండ్రులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో -1 శ్రీనివాస్, ఎ ంఈవో 2 టీవీ రామకృష్ణ , సీఆర్‌పీ లు వాసు, రాజు, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి నాలుగు చక్రాల బండి

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఫ్యాన్సీ సామాన్లు విక్రయించుకుని జీవనం వెళ్లదీసుకునే కుటుంబానికి దాత ఆసరాగా నిలిచారు. చిరు వ్యాపారులైన కొనిశెట్టి అబ్బులు, కుమారికి పొట్నూరి ఫౌండేషన్ తరపున పొట్నూరి సత్యనారాయణ, ప్రసన్న నాలుగు చక్రాల తోపుడు బండిని అందజేశారు. కార్యక్రమంలో పొట్నూరి కిరణ్‌కుమార్, జయలక్ష్మి, పొట్నూరి అప్పన్న పాల్గొన్నారు.